# కళ్ళు

అయిదయింది సాయంత్రం. గర్ల్సు హైస్కూలు అప్పుడే విడిచి పెట్టారు. పగలంతా పాఠాలు వినివిని వాడిపోయిన ముఖాలతో ఆడపిల్ల లందరూ హోలోమని బయటికి వస్తున్నారు. పగలంతా ఎండకాసీ సాయంత్రం పెద్ద నల్లని మబ్బులు కమ్మినట్టుగా నీలి యూనిఫారంతో ఆడపిల్లలు గోలగా వచ్చేస్తున్నారు. ఆడపిల్లలందరూ ఆ డ్రస్సులో చూడ ముచ్చటగా ఉన్నారు.

ఎస్సెల్సీ క్లాసునుండి హేమలత చెలికత్తెలతో బయట పడింది. బయటికి వచ్చిన దగ్గరనుండి ఒకటే వాగుడు; మెయిన్ రోడ్డయినా హేమలతకు లక్ష్యంలేదు. అయిదు గంటలసేపు స్కూల్లో ఎలా ఉంటాదో గాని విడిచీ విడవగానే మొదలు పెట్టింది. రోడ్డుమీద కనిపించిన ప్రతి వాడి గురించీ కామెంటు చేస్తోంది. కిలకిలా నవ్వుతోంది.

"ఏమే! మీ రాజకుమారుడింకా రాలేదే" మోచేత్తో పొడుస్తూ హేమని అడిగింది రజని. "ఈపాటికి బయల్దేరి ఉండాలి" అంటూ రోడ్డంతా కలయజూస్తోంది హేమలత.

"అయితే కొంపదీసి అతను నిజంగా నీ ఫేవరేట్ కాడుగదా!" రజని కొంటెగా అడిగింది. అంత గడుగ్గాయి కూడా రవంత సిగ్గు పడింది. "ఫోవే! ఏం కాకూడదా? అతనికేం తక్కువని. మంచి పొడుగ్గా ఉంటాడు, తెల్లగా ఉంటాడు. ముందుకు బుట్టలాగా క్రాపింగు ఉంటుంది. ఆ బుట్ట క్రాపుతో ఆడుకోవాలని ఉంటుంది."

కిసుక్కున నవ్విందిరజని. చిరుకోపంతో చూసి మళ్ళీ వర్ణన మొదలు పెట్టింది. "ఇంకా ఆ కళ్ళున్నాయే అబ్బ! ఎంత నెమ్మదిగా ఉంటాయో. నవ్వితే బుగ్గలు పొంగి కళ్లు కోనలు వస్తాయే. అలాంటి కళ్ళు ఆడపిల్లల కుంటేనా ఇక మనిషికంటే తెల్లని షర్టూ, ఫేంటూ తెల్లదనం అవతారమెత్తి నట్టుంటుంది.

"అవునుగానీ; నాకొక సందేహం. ఉపన్యాసం ఆపినందుకు క్షమించాలి. అతను ఎప్పుడూ తెల్ల డ్రస్సే వేసుకుంటాడేం బట్లరులాగా" అంది రజని హేమని కాస్తా ఉడికించాలని.

"ఏమిటే నీ వేళాకోళం. అతను బట్లరులాగుంటాడా? నిజంగా అలా ఎప్పుడూ తెల్ల బట్టలు వేసుకోవడం చూస్తూంటే తెలుపు ఇష్టమని తెలుస్తోంది. ఆ తెలుపు కర్థం ఏమిటో తెలుసా? నీ మొహం నీకింత పాటి తెలిసి ఏడుస్తుందేమిటి? శ్వేతవర్ణం శాంతికాముకత్వం."

"ఓహోహో! ఏమి వ్యాఖ్యానం? ఆఁ సరేగాని రాజకుమారులుంగారు వేంచేస్తున్నారు. బాగా చూసుకోండి'' అంది రజని.

హేమలత ఓరగా చూసీచూడనట్టుగా అతన్నే చూస్తోంది. అవునుమరి చూస్తే తను లోకువయిపోతుందేమో! చూడకపోతే తనివి తీరేదెలా? అందుకే చూసీ చూడనట్టు చూస్తోంది. అతను మాత్రం హేమలత కేసే చూస్తున్నాడు. అయిదు నిమిషాలు అలా నాలుగు కళ్లూ కలుసుకుంటే ఎంత తన్మయత్వంగా ఉంటుంది!

"అయిందా?" ఈ లోకంలోనికి తెచ్చింది రజని. "ఊఁ" అని మూలిగింది హేమలత. మాట్లాడ్డం విసుగెత్తి కాబోలు ఆలోచించడం మెదలు పెట్టింది. అవును రజని చెప్పింది నిజమే. తెల్లబట్టలు తప్ప మరింకే రంగూ నచ్చదా? అయినా అతనికా తెల్ల డ్రస్సే బాగా సూట్ అయింది. ఇన్నాళ్లబట్టీ తాను అతన్ని చూస్తోందిగాని అతని

పేరేమిటో ఇంకా ఏమీ గ్రహించనేలేక పోయింది. ఇకనుంచీ అదే పని మీద ఉండి, పేరూ,ఇంకా ఇతర విశేషాలూ తప్పకుండా సేకరించాలి. ఇంకెవరికైనా చెప్తే మరి మర్యాద దక్కదు. తనే సేక్‌గా వ్యవహారం సాగించాలి.

మామూలుగానే ఇల్లు చేరుకుంది హేమలత. అతనిమీది ఆలోచనలతోనే పరాకుగా ఉంది కొంతసేపటివరకూ. ఇదంతా అతని ముఖ పరిచయం ప్రారంభమైన దగ్గిరనుండే. ఆ రోజు ఇంకా కళ్ళలో మెదులుతూంటుంది.

ఆవేళ కూడా మామూలుగా స్కూలు విడిచిపెట్టారు. మెయిన్ రోడ్డుమీద తన గ్రూపంతా అట్టహాసంగా నడుస్తున్నారు. వో పది పదిహేను మంది ఉంటారు వారంతా. ఎదురుగుండా తెల్ల డ్రస్సులో తెల్లగా అతనూ, అతని ఫ్రెండూ కాబోలు వస్తున్నారు. అతను రోడ్డూ, మనుషులూ చూసుకోకుండా చేతులూపుతూ ఏదో తీవ్రంగా మాట్లాడేస్తున్నాడు. చాలా దూరంనుండి అతన్ని తను గమనిస్తోంది. కొద్ది దూరంలో ఉండగా తను కూడా అతనిలా చేతులు తిప్పుతూ మాట్లాడ సాగింది. రోడ్డుమీద కనిపించిన ప్రతివారిమీదా ఏదో ఒకటి అంటుందని తెలిసిన మిగతావారు ఒక్కసారిగా గొల్లున నవ్వవనే టక్కున అతని వాక్ప్రవాహంఆగిపోయింది. తీవ్రంగా తన కళ్ళలోకి చూసాడు. అదే మొదటిసారి.

ఆ మర్నాడు ఉదయం స్కూలుకు వెళ్ళేటప్పుడు కూడా కన్పించాడు. కాని ఈసారి మాట్లాడకుండా నెమ్మదిగా తన కళ్లలోకి చూసి ఠీవిగా వెళ్ళిపోయాడు. ఆవేళ్టి నడకచూసి తాను రాజకుమారుడని పేరు పెట్టింది. అదే వాడుక పేరుగా గర్ల్స్ హైస్కూల్లో చలామణి అవ సాగింది. తరువాత ప్రతీ రోజు ఉదయం వెళ్ళేటప్పుడూ, సాయంత్రం

వచ్చేటప్పుడూ మెయిన్ రోడ్డుమీద ఎక్కడో ఒక దగ్గర కన్పించడం మామూలు అయింది. కన్పించినపుడల్లా నెమ్మదిగా కళ్ళల్లోకి చూస్తూ కళ్ళూ కళ్ళూ కలిపేవాడు రాజకుమారుడు.

"రాజకుమారుడు హు" అనుకుని నవ్వుకుంది హేమలత. "ఒక్కసారిటురావే" అన్న అమ్మ పిలుపుతో దినచర్యలో మునిగింది.

మరునాడుదయం చిన్న గమ్మత్తు జరిగింది. స్కూలుకు వెళ్తూ వెళ్తూ అలవాటుగా రాజకుమారుడి కోసం కలయజూస్తోంది హేమలత. రాజకుమారుడు వస్తూ వస్తూ "ఏం పాపా! స్కూలుకేనా?" అని ఒక పాపను అడిగి మామూలుగానే కళ్ళు కలిపి వెళ్ళిపోయాడు. ఆ పలకరింపు తనకు వర్తిస్తుందని తెలిసినా కోపం రాకపోగా ఎందుకు హేమ వూరుకుందో తెలియక తికమక పడింది రజని.

మధ్యాహ్నం ఇంటర్వెల్‌లో కేరేజీలు పట్టుకొని డైనింగ్ రూమ్‌కు గబగబా వెళ్ళింది హేమలత. చుట్టూ చూసింది. ఒక పక్కగా ఉదయం రాజకుమారుడు పలకరించిన పాప క్యారియర్ విప్పుతూ బెరుకు బెరుగ్గా చుట్టూ చూస్తోంది. వయసుకు పన్నెండేళ్లున్నా స్కూల్లో ఆ సంవత్సరమే చేరింది కాబట్టి అంతమందిలో భోజనం చేయడం కొంచెం బెరుకుగానే ఉంటుంది మరి.

హేమలత తిన్నగా ఆ అమ్మాయి పక్కకు వెళ్ళి కూర్చుంది. కేరియర్ విప్పుతూ ఆ అమ్మాయిని "నువ్వేఫారం?" అని అడిగింది. "ఫస్టుఫారం" కళ్ళలో బెరుకుదనం నిండగా చెప్పిందా పాప.

"పేరు?"

"కుసుమ" కోమలంగా చెప్పింది పాప.

"అరేరే! కూర కలుపుకోకుండా మజ్జిగ పోసేసుకుంటున్నావేం? కూర తేలేదా?" అని అడిగింది హేమలత కలుపుగోలుగా.

"ఊహూఁ" తల అడ్డంగా తిప్పింది కుసుమ.

"సరే, ఈ బెండకాయ కూరైనా నంజుకొని తిను" అని తన క్యారియర్ గిన్నెలోని కూరను ఆప్యాయంగా కుసుమ అన్నంలో వేసింది హేమలత.

వద్దు అనాలోవద్దో ఇంకా ఆలోచించుకోనేలేదు కుసుమ. హఠాత్తుగా పెద్ద క్లాసు అమ్మాయి తనమీద ఇంత వాత్సల్యం చూపుతున్నందుకు ఆశ్చర్యం, గర్వంకూడా కలిగాయి కుసుమకు. అక్కా అని ప్రేమగా పిలుద్దామనిపించింది కూడా.

కొంతసేపు పోయిన తర్వాతనే "ఎందుకండీ" అని మాత్రం మొగమాటంగా అనగలిగింది కుసుమ.

"ఎందుకేవిటీ? తినడానికి" అంటూ హేమలత భోజనం గడుగ్గాయిలా గబగబ తినసాగింది. కుసుమ మాత్రం కళ్ళు పెద్దవి చేసుకొని హేమలతని చూస్తోంది. ఆ అమ్మాయి ప్రక్క చూడకుండానే మాట్లాడుతోంది హేమలత.

"ప్రొద్దున్న నిన్ను పలకరించాడే—తెల్ల డ్రస్సు వేసుకుని, అతనెవరు?"

"ఎవరండీ?—ఓహో మా మామయ్యా" అంది కుసుమ.

"ఏమిటీ? మీ మామయ్యా?" అని అడిగింది మళ్ళా సందేహం తీర్చుకోవటానికి.

"అవునండీ ... సరేగానండీ మిమ్మల్ని అక్కా అని పిలవనా?" ముద్దుముద్దుగా అడిగింది కుసుమ. ఒక్కసారి కుసుమను గట్టిగా ముద్దెట్టుకోవాలన్పించింది హేమలతకు. భోజనం నేస్తోంది గాబట్టి

ఆగిపోయింది. ఆ రాజకుమారుడితో అంత చక్కని వరుస తనకు కల్పించినందుకు తెలియని సంతోషంతో పొంగిపోయింది హేమలత.

"అలాగే చెల్లీ! రా చేతులు కడుక్కుందాం" అంటూ లేచింది హేమలత.

వ్యవహారం దారిలోనికి వస్తోంది అని సంతోషించింది హేమలత. ఆ రాజకుమారుడికోసం ఎందుకింత ఆర్భాటం... ఎవరినైనా అడిగేస్తే, పేరూ వూరు వివరాలు... అమ్మో ఇంకేమైనా ఉందా. అందరూ ఉడికించటం ప్రారంభిస్తారే. అతనిమీద ఇంటరెస్టు చూపించనట్టే వుండాలి. వ్యవహారం సాగాలి. క్లాసంతా ఎటు చూసినా ఆలోచనలు లాగానే కనువించాయి హేమలతకు. ఈవిషయాలు రజనీకి కూడా చెప్పకూడదనుకొంది.

అయితే అనుకోకుండా రజనీ తనకు తెలియకుండానే రాజకుమారుడి గురించి మరో వివరం హేమలతకు చెప్పింది.

"నిన్న రాజకుమారుడు పలకరించాడు ఒక పాపను, కుసుమ అనీ ఫస్టుఫారంఅమ్మాయిలే, వాళ్ళు మాయింటికి వచ్చేరు నిన్న. కుసుమ వాళ్లక్క పెళ్లట. మాకూ దగ్గర బంధువులేనట" అని చెప్పింది రజని.

ఈ మాటలు పట్టుకొని కొన్ని విషయాలు సేకరించ గల్గింది హేమలత. రజనీకి కుసుమ బంధువైనప్పుడు తనకి కూడా బంధువే అవుతుంది. కుసుమ తనకి బంధువైతే రాజకుమారుడు కూడా బంధువే అవుతాడు. అంటే రాజకుమారుడు, తానూ ఒకే కులమన్న మాట.

రాజకుమారుడూ, తనూ ఒకే కేస్ట్ అని అనుకుంటుంటే ఏదో ఆనందం ముంచెత్తుతోంది. అందులోనూ తనకు రాజకుమారుడు మామయ్య! సంతృప్తిగా తనలో చిరునవ్వు నవ్వుకుంది హేమలత.

"ఏమిటి పరధ్యానంగా వున్నావు" అని రజని క్లాసులోనికి తీసుకు పోయింది. పెదవులమీద చిరునవ్వు మాటిమాటికి మెరుస్తూ వణికిస్తోంది క్లాసులో కూర్చున్నా ఆ మామయ్యే తలపుకు వస్తున్నాడు. మామయ్యని పెళ్లి చేసుకుంటుందా తను? అప్పుడే మామయ్య అనేసి అనుకోవటం, పెళ్లి తలపు రావటంతో సిగ్గు ముంచుకు వచ్చి డస్కుకు తల ఆన్చింది.

"సిట్ రైట్" మేడమ్ హెచ్చరికతో తిన్నగా కూర్చుంది హేమలత.

ఎస్సెల్సీ క్లాసుకూ ఫస్ట్‌క్లాసుకూ కూడా ఆ వేళ డ్రిల్లు క్లాసుంది. గేమ్స్ ఆడుకోమని టీచరు చెప్పగానే హోలోమని కేకలు వేసుకుంటూ 'నేను ఈ ఆట ఆడుతానంటే, నేను దాని టీమ్‌లో ఉంటా'నని గోల చేయడం ప్రారంభించారు. ఒక పావు గంటలో అంతా సర్దుకుని ఎవరి ఆట వాళ్ళు మొదలు పెట్టారు. హేమలత, రజని రింగ్ టెన్నిస్ ఆడుకుంటున్నారు. సర్దాగా, దూరంగా ఫస్టుఫారం పిల్లలు చెమ్మచెక్క, స్కిప్పింగ్ ఆడుకుంటున్నారు.

హేమలత, రజని ఆట సీరియస్‌గానే వెళ్తోంది. వాళ్ళ కబుర్లు సైతం అంత సీరియస్‌గానూ చెప్పుకుంటున్నారు.

"ఏమేవ్ హేమా! రాజకుమారుడు జ్ఞాపకం వస్తున్నాడేమిటి?" కవ్వించడానికి అని రింగ్ విసిరింది రజని. "అవునే! నీ కంత వేళాకోళంగా ఉంది. నీ పని చెప్తా" అంటూ రింగ్‌ను మెలికలు తిప్పుతూ జోరుగా విసిరింది హేమలత. రజని పట్టుకోలేకపోయింది. ఆ రింగ్ స్కిప్పింగ్ చేస్తోన్న కుసుమకు తగిలి బోర్లపడింది. హేమలత గాభరాగా కుసుమను క్లాసులోనికి తీసుకుపోయింది. ఫస్ట్ ఎయిడ్

బాక్స్‌లోని టించర్ అయొడీన్. గీసుకుపోయిన కాలుకి పెట్టింది. ఏమంత పెద్ద దెబ్బ కాకపోయినా గాభరా పడింది హేమలత.

"నువ్వు మరి ఆడకుండా ఇక్కడే కూర్చో కుసుమా" అంది వెళ్ళిపోబోతూ. "నువ్వు కూడా ఉండు అక్కా;" అంది కుసుమ. ఇదీ మనమంచికే అనుకుంది హేమలత. కుసుమ మళ్ళీ ఒంటరిగా దొరికింది.

''అవునుగానీ. మీ మామయ్య పేరు ఏమన్నావ్ చెల్లీ" అంది హేమలత. చెల్లీ అనగానే కుసుమ ముఖం వికసిస్తుందని తెలుసు హేమలతకు.

''అప్పలరాజు''

ఛీ అప్పల రాజేవిటి? అప్పలరాజులాగా. అబ్బే పేరేం బాగా లేదు. తన కతని పేరు తెలియకపోవలసింది—అనుకుంది హేమలత. ఒకసారి అతనిమీద రాజకుమారుడు అన్నంత మంచి అభిప్రాయం కలిగింది. అలాంటి వాడిపేరు అప్పలరాజు అనడం మనసుకేం నచ్చ లేదు. పేరు తెలిసిపోయింది కాబట్టి, తను పదేపదే రాజకుమారుడు అనుకోలేదు. ప్చ్ ... పేరేం బాగాలేదు. చక్కా రాజ్‌కుమార్ అని పేరుంటే ఎంత బాగుండును. కనీసం రాజు అని ఉండినా బాగుండును. అప్పల రాజేవిటి కప్పలరాజులాగా, అబ్బే ..... బాగాలేదు. బాగుంది వాళ్ళమ్మా నాన్నా పెట్టిన పేరుకు ఎవరేం చేస్తారు? మార్చుకో బోయినా మనసు ఒప్పదు. పేరులో ఏముంది? — అని అను కుంది. కాని, అప్పలరాజు పేరు బాగుంది అని ఎంత సమర్థించుకుందా మన్నా మనసొప్పటంలేదు హేమలతకు. అప్పలరాజు... అప్పల రాజు... అప్పలరాజు... అప్పలరాజు. ఒక్కొక్కసారి అనుకుంటే తల మీద ఒక్కొక్క సుత్తి దెబ్బ కొట్టినట్టుగా ఉంటోంది.

"అరె హేమా! ఏం తల పట్టుకుని కూర్చున్నావు? తల నొప్పిగా ఉంటే ఇంటికిపోదాం పద" అంది రజని వస్తూనే. సరే అని బయల్దేరబోయింది. కాని స్కూలు టైమింకా ఉంది. ఆ టైము అయితే గాని అప్పలరాజు... అబ్బే రాజకుమారుడు ఇంకా రాడు. అయినా అచేతనంగా బయల్దేరింది హేమలత రజనితో. మెయిన్‌రోడ్డు మీద రోజులాగా అప్పలరాజు కనిపించలేదు. అతను కన్పించకపోయినందుకు ఒక వైపూ, అతని పేరు అప్పలరాజు అయినందుకు ఒక వైపూ మనసు చిల్లులు పడిపోయి బాధించింది హేమలత నా రోజు.

ఇంతకీ అప్పలరాజు ఏమిటి చేస్తున్నాడో, చదువుకుంటున్నాడా? ఉద్యోగం చేస్తున్నాడా? వూరికెనే తిరుగుతున్నాడా? ముఖం చూస్తే కనీసం గ్రాడ్యుయేట్ అయి ఉంటాడనిపిస్తోంది. ఉద్యోగం చదువూ అయితే టంచనుగా తన స్కూలు టైముకు ఎదురు రాగలడా? పోనీ డబ్బున్నవాడా లేదా? ఎప్పుడూ నీట్‌గా ఉంటాడు. టినోపాల్ అడ్వర్టయిజ్‌మెంటులాగా తెల్లబట్టలు నిగనిగ లాడుతుంటాయి. కాని ఖరీదైనవి మాత్రం కావు. చేతికి వాచీగాని, ఉంగరంకాని ఉన్నాయా? లేవు. కాళ్ళకు ఎప్పుడూ ఒకే రకం చెప్పులు. దీనినిబట్టి మధ్యతరగతికి చెందినవాడని తెలుస్తోంది. అయినా సందేహం తీర్చుకోటానికి కుసుమ నుండే విషయిం గ్రహించాలి.

మర్నాడు కుసుమ క్లాసుకు వెళ్ళుతుంటే పిల్చింది హేమలత, "క్లాసుందా?" అని అడిగింది ఉపోద్ఘాతంగా, "ఆ" అంది కుసుమ.

"మీ అక్క పెళ్ళటగా"

"అవునక్కా."

"మీ బావ ఏం చేస్తున్నా డేమిటి?"

"టెలీఫోన్ ఆపరేటర్ "

నయమే అనుకొని ఉపోద్ఘాతం ముగించింది హేమలత.

"మీ అప్పలరాజు మామయ్య చదువుకొంటున్నారా?" అసలు విషయాన్ని అడిగింది హేమలత.

"లేదండీ. మేస్టారు. మాకు అయిదోక్లాసులో మేస్టారు."

మరేం విన్పించలేదు హేమలతకు. కళ్లకేమీ కనుపించలేదు.

తీరా చూస్తే మేస్టారా ... అదీ ఎలిమెంటరీస్కూల్లో ... అందుకేనా అంతస్టయిలూ ... చదువుకునేవాడయితే ఎప్పుడో ధైర్యంచేసి తనతో మాట్లాడి వుండేవాడు. తనకు తట్టనే లేదు.

అప్పటివరకూ హేమలత మనసులో ఏర్పడిన అప్పలరాజు బొమ్మలన్నీ మాయమై పోయాయి. తారువాత కుసుమతో ముఖం చాటు చేసుకోవడం ప్రారంభిచింది. కలుపుగోలుతనంగా మాటాడే హేమలత ఎందుకు మారిపోయిందోఅర్థం కాలేదు కుసుమకు.

"అదిగో రాజకుమారు దొస్తున్నాడని"రజనీ నవ్వించబోతే "చట్" అనికోప్పడేది హేమలత. "ఏమిటో ఈ విపరీతం" అని ఆశ్చర్యపోయేది రజని. ఇప్పుడు హేమలత కళ్లల్లో అప్పలరాజు కళ్లుకలపబోయినా ఫలించటం లేదు. తనెన్ని సార్లెదురైనా హేమలత ఆకాశం ప్రక్క ఎందుకు చూస్తూందో తెలియక తికమక పడ్డాడు అప్పలరాజు.

(ఆంధ్ర పత్రిక)